ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : **బి.వి.ఎల్.ఎన్.రాజు**

సంపుటి : 15 | సంచిక : 06 | ఫిబ్రవరి 2010

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 20
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

జిన్నూరు ....... 01-01-2010
కాపవరం ...... 28-11-2009
జిన్నూరు ....... 24-11-2009

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 01-01-2010, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు భగవాన్ 130వ జయంతి. శరీరం ఉన్నప్పుడు జన్మదినోత్సవం అంటారు, శరీరం పడిపోయాక జయంతి అంటారు. భగవాన్ శరీరం తీసుకొన్న క్షేత్రం తిరుచ్చుళి, అది శివక్షేత్రం. ఆయన మధురైలో చదువుకొన్నారు. ఇప్పుడు మీరు ఏదైనా మంచి చేసారు అనుకోండి అది వెంటనే ఫలించకపోవచ్చు, ఈ జన్మలోనే ఫలించక పోవచ్చు, కొన్ని జన్మల తరువాత దాని ఫలితం రావచ్చు, అది దైవనిర్ణయాన్ని బట్టి వస్తుంది. అందుచేత మీకు మంచి చేయాలన్నప్పుడు ఆలస్యం లేకుండా వెంటనే చేసేయాలి. ఫలితం ఎప్పుడు రావాలో అప్పుడు వస్తుంది. భగవాన్ 10వ తరగతి చదువుతుండగా మరణానుభవం ద్వారా మరణాన్ని జయించారు, అది దేవరహస్యం, అది ఆయన పూర్వజన్మల పుణ్యఫలం. బ్రహ్మపదార్థం సూక్ష్మాతిసూక్ష్మంగా మన హృదయంలో ఉంది. మనందరం పెద్దవారము అయిపోవాలి అనుకొంటాము. సంఘంలో గౌరవం సంపాదించాలి, తలఎత్తుకొని తిరగాలి, పేరు సంపాదించుకోవాలి, సంఘంలో కీర్తి సంపాదించాలి అనుకొనే భక్తులకు కోటిజన్మలు ఎత్తినా వారికి ఆత్మజ్ఞానం కలుగదు. వారు పూజలు చేయవచ్చు, పూజలు చేస్తే పుణ్యం వస్తుంది, అనుభవిస్తే అది పోతుంది, కాలప్రవాహంలో అన్నీ కొట్టుకొనిపోతాయి. మనం వందకోట్లు డబ్బు సంపాదించాము అనుకోండి ఎంతమంది తింటే ఇది తరుగుతుంది అని మనం లెక్కలు వేసుకొంటాము కాని ఆ డబ్బు ఎలా వచ్చిందో అలాగే పోతుంది. ఇక్కడ రహస్యం ఏమిటి అంటే ఆ వందకోట్లు సంపాదించేటప్పుడే అది ఎప్పుడు పోవాలో ముహూర్తం పెట్టాకే వీడికి ఆ

సంపాదన ఇస్తాడు, అది మనకు తెలియదు. పెద్దపెద్ద సామ్రాజ్యాలే కాలప్రవాహంలో కొట్టుకొనిపోయాయి. మనకు ఏదైనా అధికారం వచ్చింది అనుకోండి, అది ఇలాగే ఉండిపోతుంది అనుకొంటాము. కాలప్రవాహంలో అదీ పోతుంది. ఈ శరీరం కూడా అంతే, ఒక కాలంలో మనకు ఈ శరీరం వచ్చింది, ఇంకోక కాలంలో ఈ శరీరం పోతుంది. కాలప్రవాహంలో మన శరీరమే పోతుంది కదా ఇంక శరీరం బయట ఉన్నవి పోవటం ఎంతసేపు. నా శరీరమే నాది కానప్పుడు ఈ సృష్టిలో ఏది నాది అవుతుంది అనేవాడు గౌతమబుద్ధుడు. మన పేరు అందరికీ తెలిసిపోవాలి, సమాజంలో ప్రముఖస్థానం సంపాదించాలి అనుకొనేవారికి ఎవ్వరికీ ఆత్మజ్ఞానం రాదు. కొంతమంది ఇంట్లోకూడా పెత్తనం చెయ్యాలని సరదా పడుతూ ఉంటారు. కొంతమంది తెలివైనవారు ఎలా ఉంటారు అంటే వారు ఇంటిని మేనేజ్ చేసినా వారు మేనేజ్ చేస్తున్నారు అనే భావన ఇంట్లోవారికి కూడా రాకుండా చూసుకొంటారు, అది వైజ్ బిహేవియర్.

కామము, క్రోధము, లోభము ఇవి మూడూ నరకానికి గేట్లు. కామము అంటే కేవలము స్త్రీ, పురుష సంబంధం కాదు. మనకు ఏ కోరిక ఉన్నా అది కామమే. అంటే ప్రపంచంలో నాకు అది కావాలి, ఇది కావాలి అని ఏదో ఒకటి అనుకొంటూ ఉంటాము కదా, అది అంతా కామమే. ఉన్నదంతా మన హృదయంలోనే ఉంది. ఇప్పుడు మనం కోరుకోవటం వలన ఏదీ రాదు, కోరుకోవటం మానేస్తే మన ప్రారబ్దంలో ఉన్నది పోదు. ఆ సిద్దాంతం మీకు తెలియాలి. ఏదైనా సరే మన దేహప్రారబ్దంలో వచ్చే యోగం ఉంటే మన కోరికతో సంబంధం లేకుండా వచ్చేస్తుంది. మనకు కోరిక ఉన్నా అది దేహప్రారబ్దంలో వచ్చేయోగం లేకపోతే బంగారపు కొండ మీద దొర్లినా మనకు ఏమీ అంటుకోదు, అది జ్ఞాపకం పెట్టుకోండి. కోరిక వలన ఏమీ రాదు, దేహప్రారబ్దంలో ఏది ఉంటే దానిని తప్పించుకోలేము. వస్తువు మన హృదయంలోనే ఉంది కాని మనం అక్కడకు వెళదాము, ఇక్కడకు వెళదాము, యాత్రలకు వెళదాము అంటే హృదయంలో ఉన్న బంగారాన్ని వదిలేసి పెంకుముక్కలకోసం వెతుక్కొంటున్నాము. బయట ఏదో ఉంది, ఏదో ఉంది అని మనకు అనిపిస్తోంది. మన కోరికలను బట్టి అలా మనకు అనిపిస్తోంది కాని బయట ఏమీ లేదు. ఇది మనకు అర్థమవ్వాలి. కోరిక, క్రోధము, లోభము ఇవి మూడూ ఎన్నో జన్మల నుండి మీలో గూడుకట్టుకొని ఉన్నాయి, వాటికి లోపల ఉండటం అలవాటు అయిపోయింది, బయటకు తోలినా వెళ్ళనంటున్నాయి. మీరుసజ్జనసాంగత్యం చేస్తూ, శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవిస్తూ సాధన చేసి వాటిలో నుండి విడుదల పొందితే మీ హృదయంలో ఉన్న బంగారం మీకు ఎరుకలోనికి వస్తుంది, అదే కడసారిజన్మ.

కామక్రోధాల గురించి మనకు డీటైల్‌గా అర్థమయ్యేలాగ తులసీదాసుగారు చెప్పారు. ఈ

కామం ఒక తీగలాంటిది ఆనపకాయపాదు పెట్టి అది పాకటానికి ఒక పందిరి వేస్తాము. ప్రతీవాడిలోనూ కామం ఉంటుంది. ఆ కామాన్ని పెళ్ళి పెంచేస్తుంది అని చెప్పాడు. మా అబ్బాయి బుద్ధిమంతుడు అని తల్లి అంటుంది, పెళ్ళి అయ్యాక మారిపోయాడు అని చెపుతుంది. ఆ మారిపోవటం ఏమిటో మనకు తెలియదు. ఈ రహస్యం అంతా కామంలో ఉంది అని తులసీదాసు చెప్పారు. భర్తకి కామం ఉంది అనుకోండి, అది పెరగటానికి భార్య పందిరిలాగ ఉపయోగపడుతుంది. కామం అనే తీగ పెరగటానికి భార్యకు భర్త పందిరి, భర్తకు భార్య పందిరి, ఇలా ఒకరికి ఒకరు ఉపయోగపడుతూ ఉంటారు, కామం అలా పెరిగిపోతూ ఉంటుంది, ఇంక అది ఆరదు. ఏదో కాలక్షేపం కోసం సాధన చేస్తారు, గుడులు చుట్టూ తిరుగుతారు అదీ కోరికలు నెరవేర్చుకోవటానికి అలా చేస్తారు. దీనివలన కామం తగ్గదు సరికదా కామం పెరిగిపోతుంది. అసలు మనకు ఆత్మజ్ఞానం అక్కరలేదు ఎందుచేతనంటే దాని విలువ మనకు తెలియటంలేదు. కొంతమంది బాగా సంపాదిస్తారు. వారి గర్వం అంతా ఇంట్లో వారిమీద చూపిస్తూ ఉంటారు. కోపం ఉన్నవారు అందరూ పరుషవాక్యాలు మాట్లాడతారు. వారి నోటినుండి మంచిమాటలు రావు, చెడ్డమాటలే వస్తాయి. ఏ మాట అనాలో, ఏ మాట అనకూడదో వారికి తెలియదు. మన సంసారానికి సరిపడ సంపాదన ఉంటే సరిపోతుంది. ప్రారబ్దాన్ని బట్టి డబ్బు పెరుగుతోంది అనుకోండి, ఎంత డబ్బు పెరుగుతూ ఉంటే అంత ఆశ పెరుగుతుంది అది మనకు తెలియదు. అంటే సంపాదన ఆశను పెంచేస్తుంది, పెళ్ళి కామాన్ని పెంచేస్తుంది, పరుషవాక్యాలు కోపాన్ని పెంచేస్తాయి అని తులసీదాసుగారు చెప్పారు. సామాన్య సంసారంలో ఉన్నప్పడే చాలామంది ఎవరో ఒకరికి సహాయం చేస్తూ ఉంటారు. డబ్బు పెరిగాక అంతకుముందున్న వితరణ కూడా పోతుంది. మీరు ఏవైనా మంచిపనులు చేయాలన్నప్పడు మామూలుగా మధ్యతరగతి ప్రజల మీదే ఆధారపడండి, ధనవంతులమీద ఎప్పడూ ఆధారపడవద్దు అని వివేకానంద చెప్పేవారు.

మనకి గురువు సుమిత్ర. సుమిత్ర చాలా గొప్పవ్యక్తి. సుమిత్రకు లక్ష్మణుడు, శత్రుఘ్నుడు ఇద్దరు పిల్లలు. మన పిల్లలు చక్రవర్తులు అయిపోవాలి, రాముడిలాగ అయిపోవాలి అని ఆవిడ అనుకోలేదు. సుమిత్రది నూటికి నూరుపాళ్ళు సేవాభావం. లక్ష్మణుడిని రాముడికి సేవ చేయమని చెప్పింది, శత్రుఘ్నుడిని భరతుడికి సేవచేయమంది. అంటే సేవారంగానికి తన కొడుకులను అప్పగించింది. అదీ సంతోషంగా, శాంతిగా చేసింది. ఆవిడ హృదయంలో ఉన్నది సేవాభావమే. మన సంతానాన్ని సేవారంగానికి ఎంతమంది అప్పగించగలము, ఎవరూ ఇవ్వలేము. ఆవిడ ఒక మహారాజుకి భార్య అయి ఉండి, వారు మహారాజు కొడుకులు అయి ఉండి వారిని సేవారంగానికి ఇచ్చింది, అది గొప్పతనం. రాముడిని అరణ్యానికి పంపినప్పడు అందరూ కైకను అసహ్యించు

కొన్నారు కాని సుమిత్ర అసహ్యించుకోలేదు, అది ఈశ్వర నిర్ణయం అంది. అంతకుముందు కైకపట్ల ఎలా ఉందో ఈ సంఘటన జరిగిన తరువాత కూడా అంత కూల్‌గా, అంత నిర్మలంగా ఉంది. రాముడు అరణ్యానికి వెళ్లినప్పుడు కౌశల్యను ఒప్పించటం చాలా కష్టం అయ్యిందికాని సుమిత్ర లక్ష్మణుడిని ఆశీర్వదించి పంపింది. ఈ ఆధ్యాత్మిక రంగంలో హృదయం యొక్క లోయలలోనికి చేరుకోవటానికి ప్రయత్నం చేసేటప్పుడు ఇతరులమీద ఆధారపడవద్దు, ఎవరో వచ్చి సహాయం చేస్తారని ఎదురు చూడవద్దు, మన కాళ్లమీద మనం నిలబడి అభివృద్ధిలోనికి రావటానికి ఎవరికి వారు ప్రయత్నం చేస్తూ ఉంటే మీరు తప్పనిసరిగా తరిస్తారు. ఆహారం విషయంలో మీరు జాగ్రత్తగా ఉండాలి. ఈ పొట్ట ఏదో కావాలి అంటుంది, ఎప్పుడు తినేద్దామా అని నోటికి కంగారు, ఎప్పుడు సినిమాకు వెళ్లిపోదాము, టీవీ ఎప్పుడు చూసేద్దాము అని నీ కళ్లకు కంగారు. శరీరంలో ఉన్న అన్ని ఇంద్రియాలు వేగంగా వెళ్లిపోతూ ఉంటే ఇంక సాధన ఏమిటి? మనం అందరం కూడా మనకు కావలసిన దానికంటే ఎక్కువ తినేస్తున్నాము అని మనకు తెలియటం లేదు. మీరు ఎక్కువ తినేస్తారు అనుకోండి, ఆలోచనా శక్తి తగ్గిపోతుంది. ఎక్కువ తినేసేవాడికి జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది. ఆచార్యులవారు ఏమన్నారు అంటే నీకు ఏదైనా రోగం వస్తే ఔషదం ఎలా వాడతావో అలాగే ఆకలి అనే రోగానికి సరిపడ అన్నంపెట్టు అని చెప్పారు.

మనం మాట్లాడేమాట, చేసేపని నిర్మలంగా ఉండాలి. ఏ పనీ గొప్పలకోసం చేయవద్దు. లోకంలో మెప్పకోసం పనులు చేయవద్దు, ఈశ్వరునిదయ సంపాదించటానికి పనులు చెయ్యండి. అజాగ్రత్త పనికిరాదు, అశ్రద్ధ పనికిరాదు. ఈ ఆధ్యాత్మిక మార్గంలో అభివృద్ధి పొందటానికి ఎవరికి వారు సాధన చేయవలసిందే. తల్లి ఏదో సహాయం చేస్తుంది అని కూతురు, కూతురు సహాయం చేస్తుందని తల్లి ఇలా ఎదురుచూడటం వలన ప్రయోజనం లేదు, ఇందులో ఒకరికి ఒకరికి సంబంధం లేదు. మనం ఒంటరిగా ఈ భూమి మీదకు వచ్చాము, మరల ఒంటరిగా ఈ భూమిని విడిచిపెట్టిపోవలసిందే. భగవంతుడు చెప్పిన మాటలను ప్రమాణంగా తీసుకొని జీవిస్తూ మీరు జాగ్రత్తగా సాధన చేస్తూ ఉంటే ఈ జన్మలోనే తరిస్తారు. సముద్రం వర్షాకాలంలో పెరిగిపోదు, వేసవికాలంలో తరిగిపోదు. నదులు వెళ్లి కలిసినా అలాగే ఉంటుంది, నదులు వెళ్లి కలవకపోయినా అలాగే ఉంటుంది. జ్ఞానిస్థితి అలాగే ఉంటుంది. వాడి కోరికలు అన్నీ నెరవేరినా వాడికి ఏమీ అనిపించదు, ఒక్క కోరిక కూడా నెరవేరకపోయినా వాడికి ఏమీ అనిపించదు, నిర్మలంగా నిశ్చలంగా ఉంటాడు, వాడు సముద్రుడు, వాడు జ్ఞాని. నిరంతరం కోరికల గొడవలలో ఉన్నవారు, నిరంతరం ప్రకృతి గొడవలలో ఉన్నవారు సముద్రంలాగ నిండుగా ఉండలేరు గురువు అంటే మీరు సామాన్యం అనుకోవద్దు. రమణుడు, రామకృష్ణుడు వారు మహాజ్ఞానులు, వారు

సామాన్యులు అనుకోవద్దు. మీ పూర్వపుణ్యాన్నిబట్టి మీకు ఒక మహాజ్ఞానిమీద, ఆయన పాదాలమీద విశ్వాసం కుదిరితే ఇంజనుకు తగిలించిన పెట్టెలను ఆ ఇంజను ఎలా లాగుకొనిపోతుందో అలాగే ఆయన మిమ్మల్ని తీసుకొనిపోయి మోక్షంలో పడేస్తాడు. వాడు గురువు. పూర్వపుణ్యం లేకపోతే ఆయన మీద మీకు విశ్వాసం కలుగదు. పూర్వజన్మలో మనం సత్కర్మ చేయలేదు అనుకోండి, సజ్జనసాంగత్యం చేయలేదు అనుకోండి, శాస్త్రాన్ని శ్రవణం చేయలేదు అనుకోండి మనకు ఏ మహాత్ముడి మీదగాని, అవతార పురుషుడిమీదగాని భక్తి కలుగదు.

రామకృష్ణ పరమహంసగారు ఏమన్నారు అంటే ఎక్కడికి వెళ్ళినా ఈ నేను గొడవ ఏమిటి? నేను మాట్లాడాను, నేను అలా చేసాను, నేను అది సాధించాను అని ఎక్కడికి వెళ్ళినా ఈ నేను గొడవే, వినలేకపోతున్నాను. ఇంక ఈ నేను గొడవ వదిలేయండి. నువ్వు నువ్వు అనండి అన్నాడు రామకృష్ణుడు. నువ్వు అంటే భగవంతుడు. మీరు ఏదైనా మంచి పని చేసినా నేను చేసాను అనకండి, నువ్వే చేసావు అనండి. అస్తమాను ఆ నేనును తలపెట్టుకొంటూ అందులో నుండి ఎలాగ బయటకు వస్తారు. నువ్వు ఏదైతే నేను, నేను అంటున్నావో అది దేహగతమైనది, మనోగతమైనది. సత్యమైననేను ఒకటి నీ హృదయంలో ఉంది. దానికి పరిమితులు లేవు, హద్దులు లేవు. ఏ నేనునైతే నువ్వు విడిచిపెట్టాలో దానితోటి ఉంటూ, దాని గురించే అస్తమాను ఆలోచిస్తూ ఉంటే ఇంక దానిని ఎలా విడిచిపెట్టగలవు. జ్ఞానం అంటే ఏమిటి అంటే ఏదైతే మనం నేను, నేను అని అంటున్నామో ఆ నేను నేనుకాదని తెలుసుకోవటమే జ్ఞానం అన్నారు రామకృష్ణుడు. నువ్వు చెప్పే నేను నువ్వు కాదని తెలుసుకోవటమే జ్ఞానం. అందరి హృదయాలలో అంతర్యామిగా భగవంతుడు ఉన్నాడు. మనం కేవలం కీలుబొమ్మలం మాత్రమే. ఆడించేవాడు మనలోపలే ఉన్నాడు. మనం ఆడించేవాడిని వదిలేసి ఆడే బొమ్మలను పట్టుకొని తిరుగుతున్నాము అన్నాడు రామకృష్ణుడు. చంటిపిల్లలు ఏడిస్తే నాలుగు బొమ్మలు ఎదురుగా పడేస్తే వాటితో ఆడుకొంటూ కాలక్షేపం చేస్తారు. మనం కూడా అంతే ఈ బొమ్మలతో ఆడుకొంటూ కాలక్షేపం చేసి చనిపోతున్నాము. అంతర్యామిగా ఉన్న నారాయణుడిని వదిలేస్తాము. ఉదయం నుండి పళ్ళు ఇస్తున్నారు మేము పుచ్చుకొంటున్నాము. ఇప్పుడు మరల ముందుగా మా పళ్ళు పుచ్చుకోండి అంటున్నారు. మీటింగు తరువాత చెపుదురుగాని ముందు పళ్ళు పుచ్చుకోండి అంటున్నారు. ఇలా అయితే ఇంక ప్రవచనం ఎప్పుడు, జ్ఞానామృతం ఎప్పుడు. అంత తొందరైతే ఎలాగ. అక్కడ భగవాన్ పటం ఉంది, అది పటం అనుకోవద్దు. మీకు ఎవరికైనా తొందరపని ఉంటే ఆ పటం దగ్గర పళ్ళు పెట్టేసి వెళ్ళిపోవచ్చు. ఇక్కడ భయం ఏమిటి అంటే ఆ పటం గుర్తించిందో లేదో అని. ఈ రెండు అరటిపళ్ళకు, బత్తాయిలకు మరల పెద్ద గుర్తింపులు కావాలి. అసలు ఈ గుర్తింపులకు

అలవాటు పడిపోయి మనం పాడైపోతున్నాము అన్న సంగతి మనకు తెలియటం లేదు. భగవాన్ పటాన్ని బొమ్మ అనుకోవటం ఎందుకు భగవానే అనుకోవాలి, అప్పడు వాడు తరిస్తాడు. అసలు త్యాగం అనేది ఎందుకు పెట్టారు అంటే ఎప్పటికైనా మనం కానిది మనం వదిలేయటానికే త్యాగం. మనకు దేహబుద్ధి ఉంది. త్యాగికానివాడు దేహబుద్ధిని వదిలిపెట్టలేడు.

ఉపనిషత్‌లలో ఒక కథ వస్తుంది. దేవతలు, రాక్షసులు, మానవులు ముగ్గురు బ్రహ్మదేవుడి దగ్గరకి వెళ్ళి మాకు ఏదైనా ఉపదేశించండి అన్నారట. ముగ్గురికి ఒకటే ఉపదేశం 'ద' అన్నాడు. దేవతలకు ఉపదేశం 'ద' అంటే దమం నేర్చుకోండి అంటే నిగ్రహం నేర్చుకోండి. దేవతలు ఎక్కువ భోగాలకు అలవాటు పడిపోయారు. భోగాలకు ఎక్కువ అలవాటుపడినవారు దమం నేర్చుకోవాలి అంటే మనస్సును నిగ్రహించుకోవాలి. భోగజీవితం వలన పాడైపోతారు, భోగజీవితం వలన మోక్షం రాదు. త్యాగ జీవితం వలన, యోగజీవితం వలన మోక్షం వస్తుంది. రాక్షసులకు ఉపదేశం 'ద' అంటే దయ. రాక్షసులకు క్రూరత్వం ఉంటుంది. కొంతమంది ఎవరికైనా కష్టం వస్తే సంతోషిస్తారు, అటువంటి మనుషులు ఉంటారు. ఇటువంటి రాక్షస స్వభావం ఉన్నవారికి దయ అనేది ఉండదు. అందుచేత రాక్షసులకు దయ నేర్చుకోండి అని చెప్పాడు. ఇంక మానవులకు ఉపదేశం 'ద' అంటే మానవులలో ఎక్కువమందికి లోభిత్వం ఉంటుంది. అందుచేత 'దానం' నేర్చుకోండి అని చెప్పాడు. చేతినిండా డబ్బు, ఇంటి చుట్టూ కార్లు ఉన్నాయని విచ్చలవిడిగా ఉండకండి, దాని వలన లోపల కుళ్ళిపోతారు. ధనం కోసమే అక్కాచెల్లెలకు, భార్యాభర్తలకు పేచీలు. మానవులకు దానం నేర్చుకోండి అని చెప్పాడు. మీరు ఎవరికైనా ఏదైనా సహాయం చేస్తే వారు కోటీశ్వరులు అయిపోరు. ఎవరో కొంతమంది తీసుకొనేవారు ఉన్నారు కాబట్టి మీకు ఇచ్చే అవకాశం ఉంది అలా చూసుకోండి అంతేగాని మీరు గర్వం పెంచుకోవద్దు. దానం అనేది అర్థం చేసుకొంటే నువ్వు ఏదైతే కాదో దానిని విడిచిపెట్టేస్తావు. అప్పడు దేహవాసన పోతుంది, లోకవాసన పోతుంది, శాస్త్రవాసన పోతుంది, నీ మనస్సుతో తాదాత్మ్యం పోతుంది. నువ్వు కానిది విడిచిపెట్టేస్తే నువ్వు ఏదిగా ఉన్నావో దాని తాలుక ఎరుక నీకు వస్తుంది.

లోకంలో గౌరవం పొందాలి, ఏదో ప్రముఖస్థితిని పొందాలి అనే తత్వంతోటి మనం పాడైపోతున్నాము. మీరు నిర్వాణసుఖాన్ని పొందటంకోసం ప్రయత్నం చేయటం మానేసి ఈ ప్రకృతి గొడవలు, ఈ అల్లర్లు ఏమిటి అంటున్నాడు గౌతమబుద్ధుడు. మనకు అవసరం లేని గొడవలలోనికి వెళ్ళి అజ్ఞానాన్ని పెంచుకొంటున్నాము. అందుచేత ఎవ్వరిడే ట్రైటు రినౌన్స్ ప్రామినెన్స్. ఇది సాధనలో ఒక భాగం. భగవంతుడు ఒకో మనిషికి ఒకో పనిని కేటాయిస్తాడు. ఆ పనిని మీరు రియాక్షన్ లేకుండా చేయాలి. వచ్చేది ఏదో వస్తుంది, రానిది ఏదో రాదు. భగవంతుడు మీకు కేటాయించిన

పనిని జాగ్రత్తగా, శ్రద్ధగా చేయాలి. మన చేతిలో ఉన్న పనిని నేను చేస్తున్నాను అనే భావన లేకుండా చేయాలి. పనిని మనం బలవంతాన విడిచిపెట్టేయకూడదు. పని మనలను విడిచిపెట్టేసింది అనుకోండి దానివలన మనకు నష్టం లేదు. మనం ఎంతసేపు వైకుంఠానికి వెళ్ళిపోదాము, కైలాసానికి వెళ్ళిపోదాము అని చూస్తాము. మనస్సు యొక్క వేగం అలా ఉంటుంది. ఎక్కడికి వెళ్ళినా నీ మనస్సే కదా. అది నిన్ను విడిచిపెట్టటం లేదు కాశీ వెళ్ళినా, రామేశ్వరం వెళ్ళినా నీ మనస్సు నీకూడా వచ్చేస్తుంది. నువ్వు దానిని వదిలించుకోవాలి. వైకుంఠాల గొడవ, కైలాసాల గొడవ వదిలేసి, చావు పుట్టుకల గొడవ వదిలేసి, పుణ్యపాపాల గొడవ వదిలేసి మీ మనస్సును నిర్మలం చేసి, నిశ్చలం చేసి, పవిత్రం చేసి, దానిని అంతర్ముఖం చేసి ఎక్కడైతే ఈశ్వరుడు ఉన్నాడో ఎక్కడైతే బ్రహ్మం ఉందో అక్కడకు అంటే మీ హృదయంలోనికి మనస్సును నెట్టుకొనిపోవటానికి ప్రయత్నం చేసాడు అది భగవాన్ చేసిన పని. నువ్వు ప్రశాంతంగా ఉండి, నీ పని ఏదో జాగ్రత్తగా చేసుకొంటూ, మనస్సును అంతర్ముఖం చేయటానికి ప్రయత్నం చెయ్యి. పరమపవిత్రుడికిగాని మనస్సు అంతర్ముఖం అవ్వదు. ఎప్పుడైతే మనస్సు పరమపవిత్రం అయ్యిందో అది హృదయంలోనికి వెళ్ళి బ్రహ్మంలో ఐక్యమవుతుంది. అప్పడు నువ్వు పోవు. నువ్వు ఏదిగా ఉన్నావో అది నీకు ఎరుకలోనికి వస్తుంది. దాని స్వరూపం సుఖం కాబట్టి సుఖంకోసం ఇంక నీవు బయట వెతకవలసిన అవసరం లేదు.

ప్రతీ మనిషికి సుఖం కావాలి కాని అది ఎక్కడ ఉందో మనకు తెలియటంలేదు, ఎలా పొందాలో తెలియటంలేదు. అది ఎక్కడ ఉందో, దానిని ఎలా పొందాలో మీకు తెలియజేసి అక్కడకు మిమ్మల్ని తీసుకొనిపోవటానికి ప్రయత్నం చేసాడు, వాడు రమణగురువు. దీనికి మధ్యవర్తులతోటి సంబంధం లేదు, దేవతలతో సంబంధం లేదు, డైరెక్టుగా మీ మూలంలోనికి మిమ్మల్ని పంపటం, అక్కడకు వెళ్ళిన తరువాత మీరే సుఖం అయిపోతారు. అసలు మీకు ఏ చింతన రాదు. సుఖం లేనివాడు సుఖంకోసం తిరుగుతాడు. సుఖి సుఖంకోసం ఎక్కడ తిరగాలి, వాడే సుఖం కాబట్టి ఇంక సుఖంకోసం బయట తిరగవలసిన పనిలేదు. మేము చాలా చాకిరీ చేస్తున్నాము, ఎవరూ గుర్తించటంలేదు అని చాలామంది అంటారు. అక్కడే మీరు పాడైపోతున్నారు. అసలు గుర్తింపులు జోలికి వెళ్ళకండి. ఇతరులు మనల్ని గుర్తించాలి అనే భావన మీకు ఎప్పుడైతే వచ్చిందో మీకు వ్యక్తిభావన పెరిగిపోతుంది, దేహబుద్ధి పెరిగిపోతుంది. భగవద్గీత చాలాసార్లు చదువుతాము. మాకు అర్థమయింది, మాకు తెలిసిపోయింది అనుకొంటాము కాని భగవద్గీతలో మనకు తెలియని విషయాలు చాలా ఉంటాయి. ఎందుచేతనంటే మనవి చిన్న తలకాయలు. ఈ సృష్టిలో ఒకో మనిషి ప్రవర్తన ఒకోలాగ ఉంటుంది, క్రూరత్వం ఉంటుంది, ఎందుకు అలా ఉంది అంటే అవి మనం ఊహించలేము, అవి మన తలకాయకు అందని విషయాలు. అందుచేత మనకు ఎంతవరకు అర్థమైతే అంతవరకూ సాధన చేసి మనం

తరించాలి కాని మనకు అందని విషయాల గురించి ఆలోచిస్తూ మన తలకాయ పాడుచేసుకోకూడదు. ఒక మనిషికి డబ్బు ఉండవచ్చు, పాండిత్యం ఉండవచ్చు. దాని వలన ప్రమాదం లేదు. ఆ డబ్బుతోటి, పాండిత్యంతోటి తాదాత్మ్యం పొందటంవలన అహంకారం పెరిగిపోతుంది. మీరు ఇల్లు విడిచిపెట్టి ఎక్కడికో పారిపోనక్కరలేదు. మీ ఇంటిలో ఉండి మీ పని ఏదో మీరు శ్రద్ధగా చేసుకొంటూ అహంభావనను తగ్గించుకోవటానికి సాధన చెయ్యండి. మనిషి అయ్యాక ఎప్పుడైనా అవమానాలు వస్తూ ఉంటాయి, వాటిని కూడా భరించటం నేర్చుకోండి. అది కూడా సాధనలో ఒక భాగము. మనోదేహములనుండి, లోకవాసనలనుండి, నువ్వుకాని గొడవలనుండి నీకు స్వేచ్ఛ ఎప్పుడు కలుగుతుంది అంటే నీ హృదయంలో ఉన్న సత్యవస్తువు నీకు ఎరుకలోనికి వచ్చినప్పుడు వాటి నుండి విడుదల పొందుతావు, నీకు నిజమైన స్వేచ్ఛ కలుగుతుంది.

మీరు సత్వగుణం అభివృద్ధి చేసుకోండి. మీ మాట, చేత, ఆలోచన సౌమ్యంగా ఉండాలి. మీరు ఎవరినైనా ప్రేమించగలిగితే ప్రేమించండి. ఎవరినీమాత్రం ద్వేషించవద్దు. ప్రాణం పోసే శక్తి నీకు లేదు అందుచేత ఎవరి ప్రాణం తీయవద్దు. సాత్వికులు ధన్యులువారు దేవుని చూచెదరు. కొంతమంది ఎప్పుడూ ఇతరులను ఏదో ఒకటి అంటూ ఉంటారు, తిడుతూ ఉంటారు. అన్నవాళ్లకంటే పడ్డవాళ్ళు గొప్పవాళ్ళు అని పెద్దలు చెపుతారు. అలా ఏదో ఒకటి అనటం వలన, తిట్టటం వలన, వాగాడంబరం వలన కోపం పెరిగిపోతుంది, రజోగుణం పెరిగిపోతుంది. ఆ మాటలను భరించటం వలన మన మనస్సు హృదయంలో ఉన్న సత్యం వైపుకు ఉపసంహరింపబడుతుంది. కుటుంబంలో ఉన్నప్పుడు ఏవో గొడవలు వస్తూ ఉంటాయి, ప్రతీదీ రాద్ధాంతం చేసేసుకోకండి. మీ తప్పు లేకపోయినా ఒకోసారి మీ ఇంట్లోవారు మిమ్మల్ని ఏదో ఒకటి అంటూ ఉంటారు. వాటిని పెద్దవి చేసేసుకోకుండా, వాటితో రాజీపడటం నేర్చుకోండి. అంతేగాని ఈ గొడవలు, కక్షలు పెట్టుకొని అసలు గమ్యాన్ని విడిచిపెట్టవద్దు. మనం ఎటువంటి పరిస్థితులలో ఉన్నామో భగవంతుడికి తెలియదా, ఆయనే ఇటువంటి పరిస్థితులు పెట్టాడు, మన మంచికోసమే ఇది అంతా చేస్తున్నాడు అని అర్థం చేసుకొని కాలక్షేపం చేయండి. అలా జీవిస్తూ ఉంటే ఒకవేళ మీకు వెంటనే మోక్షం రాకపోయినా ఇప్పుడు మీరు పడే బాధలు వచ్చే జన్మలో రావు. మీరు తాత్కాలిక ఉద్రేకాలకు పోయి గమ్యాన్ని మరిచిపోవద్దు. ఈ శరీరంలో ఉండగానే మనం పునర్జన్మలేని స్థితికి ఎదిగి వెళ్ళాలి. మీకు ఇంటినిండా సంపద ఉన్నా మీ మాటలో, ప్రవర్తనలో, మీ ముఖంలో అవినయం కనుక ఉంటే ఆత్మజ్ఞానసముపార్జన సాధ్యంకాదు. నా ప్రవర్తనలో అవినయం లేకుండా చూడు అదే నా మొదటి ప్రార్థన, చివరి ప్రార్థన అన్నారు ఆచార్యులవారు. ఎక్కడైతే వినయం ఉందో అక్కడ జ్ఞానం ఉంటుంది కాని అవినయం ఉన్న చోటుకు జ్ఞానంరాదు. మీరు ఇంటి దగ్గర సాధ్యమైనంతవరకు సమానంగా ఉండటానికి

ప్రయత్నం చేయండి. ఇంటి దగ్గర గౌరవిస్తున్నారు అని పొంగిపోవద్దు, గౌరవించటంలేదని కుంగిపోవద్దు. అలా పొంగు, కుంగు ఉంటే ఇంక మీ మనస్సు అంతర్ముఖం అవ్వదు. అంతర్‌దృష్టిలేనివాడికి ఆత్మజ్ఞానం కలుగదు. హిరణ్యకశిపుడు భౌతికవాది, ప్రహ్లాదుడు ఆధ్యాత్మికవాది. మనందరం ప్రహ్లాదుడి పార్టీలో ఉండాలి. ప్రహ్లాదుడిని తండ్రి అనేక కష్టాలు పెట్టాడు. ఆ కష్టాలు అన్నీ భరించాడు కాని నన్ను ఇన్ని కష్టాలుపాలుచేస్తున్నాడు అని మనస్సులో తండ్రి మీద వికారం రాలేదు. మనలను ఎవరైనా బాధపెడుతూ ఉంటే మనం సహించినా వారు బాధపెడుతున్నారు అని మనస్సులో ఉంటుంది, అది కూడా ప్రహ్లాదుడికి లేదు, వాడు భక్తులలో అగ్రగణ్యుడు. అంటే ఏమీ వికారం లేకుండా అన్నీ భరించాడు పైగా వాడిని ఎవడైతే కష్టాలు పెట్టాడో వాడిమీద ద్వేషభావం లేదు. అందుచేత మనకు ప్రహ్లాదుడు గురువు, సుమిత్రాదేవి కూడా మనకు గురువు. సంసారపక్షంగా సుమిత్రాదేవిని జ్ఞాపకం పెట్టుకొంటే, ఆ రకంగా మనం జీవిస్తే ఈ జన్మలోనే తరిస్తాము.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-11-2009, కాపవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు గీతాజయంతి. ప్రపంచ సాహిత్యంలో ఒక్క భగవద్గీతకు తప్పించి ఏ పుస్తకానికి జయంతులు చేయరు. భగవద్గీత మన దగ్గర ఉంటే నాలుగు వేదాలు మన దగ్గర ఉన్నట్లే. భగవద్గీతలో జ్ఞానయోగం, కర్మయోగం, భక్తియోగం, ధ్యానయోగం అన్నింటి గురించి వివరంగా చెప్పాడు. మనం ఏ పని చేసినా భక్తి అవసరం. ఇది దేవుడి పని, ఇది లోకానికి సంబంధించిన పని అని మనం విడదీస్తాము. అలా మనం విడదీయకూడదు. ఈ సృష్టిరూపంలో ఉన్న వాడు భగవంతుడే. మనం భగవంతుడిని ఎలా పూజిస్తామో మనం ప్రపంచంలో పని కూడా అలాగే చేయాలి. భగవద్గీతను అధ్యయనం చేసి, అర్థం చేసుకొని, అనుభవంలోనికి తెచ్చుకొంటే మనం గమ్యానికి చేరుకొంటాము. ప్రపంచంలో అనేక కోట్ల జనం ఉన్నారు, అందరి మనస్తత్వాలకు తగిన సమాధానం భగవద్గీతలో దొరుకుతుంది. మీకు అశాంతిగా ఉంది అనుకోండి, దుఃఖంగా ఉంది అనుకోండి, గీతలో ఏదో ఒక శ్లోకం మీ దుఃఖాన్ని ఆర్పేస్తుంది. మీరు అర్థం చేసుకోకుండా చదివినా పుణ్యం వస్తుంది. అర్థం చేసుకొని చదువుతూ ఉంటే మీకు శాంతి కలుగుతుంది. భగవద్గీత సమన్వయ గ్రంథం, ఉపదేశ గ్రంథం, అర్జునుడిని వంపు పెట్టుకొని పరమాత్మ మన గురించి చెప్పిన శాస్త్రం. భగవద్గీతలో శంకరాచార్యులవారు అద్వైతం చూస్తే, మధ్వాచార్యులు ద్వైతం చూసారు, రామానుజాచార్యులు విశిష్టాద్వైతం చూసారు. అంటే ఎవరి కోణంలో వారు వ్యాఖ్యానాలు వ్రాసారు. తిలక్‌గారు కర్మయోగం గురించి ఎక్కువ వ్రాసారు. మన బుద్ధిని బాగు చేసుకోవటం కంటే మించిన పని ప్రపంచంలో ఏదీ లేదు. నీ బుద్ధిని నువ్వే బాగుచేసుకో,